మనుసు

శ్రీ కొడవంటి సూర్యలక్ష్మణరావు

సత్తిపాడు గ్రామం. గ్రామానికంతటికీ ఒక్కడే ఒక్కడు ఆయుర్వేదవైద్యుడు కన్నయ్య. తానేకాదు వంశపారంపర్యముగా తాతలనాటినుండి వస్తుండే వృత్తే అది అతనికి. అన్నిటికంటె యిరుకుపట్లు పాముకాట్లు నయంచేయడానికా చుట్టుపట్ల అతన్ని మించిన చేయి లేదని ప్రసిద్ధి. అతని పేరు పఠిస్తేనే పాములన్నీ పారిపోతాయని వాడుక. కులానికి మాలవాడైనా అతన్ని ఆగ్రామీయులంతా గౌరవపూర్వకంగా "దొరా" అనే పిల్చేవారు. ఆ వూళ్లోనే ధన్వంతరి ఔషధాలయమని, ఒక చిన్నగదిలో మందులుపెట్టికొని అందరికీ చికిత్స చేస్తుండేవాడు కన్నయ్యదొర. చేతనయినంత వరకు ఉచితంగానే సేవచేస్తూండినా, వారూ వారూ యిచ్చినడబ్బు న్యాయార్జితం గనుక కొంచెం నిలవేసి, వూరికో మైలుదూరంలో ఒకతోట కొనుక్కొని పాక కట్టుకున్నాడు. పిత్రార్జిత మేమీ లేదు సరికదా, స్వార్జితమైనా ఆ ఒక్కతోట, పాకమాత్రం మిగిలాయి కన్నయ్యకు ఆ యాభయ్యోపడిలో. మొదటి భార్య చనిపోగా, సంరక్షణకు పనికివస్తుంది కదా అని రామి అనే పద్దనిమిదేళ్ల పిల్లను తెచ్చికొని ఒక సంవత్సరంనుంచి తోటలోనే కాపురం పెట్టాడు. రామికి వేరే యింకెవ్వరూ దిక్కులేకపోగా అతని దగ్గరే వుండిపోవలసి వచ్చింది, యిష్టం లేకపోయినాను. ఇప్పటికి తనకి సంతానం లేదు. రామివాటం చూస్తే యికమీదట వుంటారని ఆశకూడాలేదు. వంశపారంపర్యంగా వచ్చిన యీ మాంత్రికవైద్యవిద్య తనతో ఆగిపోవలసి వస్తుందేమోననే బెంగపడేవాడు కన్నయ్య. పిల్లలు కలుగకపోతారా అని మళ్లీ తృప్తిపడేవాడు.

* * * *

అప్పుడే భోంచేసి కన్నయ్యా, ఆ వేళ వచ్చిన చుట్టం వీరయ్యా ఆ చేలల్లోంచి గ్రామం వేపు నడచిపోతూంటే వాళ్లిద్దరూ కనుమరుగైందాకా వాకిట్లో చూస్తూ నిలబడింది రామి. మంచి వయసులో నుండి, నూనూగుమీసాల్తో, గిరజాలజుట్టుతో, బెంగాలీపంచ, కిర్రుజోడు, పూజీసిల్కు వుత్తరీయం ధరించిన వీరయ్యకీ నలభైఅయిదోయేట, తీక్ష్ణమయిన కళ్లతో, ముతకగుడ్డలు కట్టిన, మొగడు కన్నయ్యరూపానికీ రామికంటి కెంతో వ్యత్యాసం కనపడిం దాసమయాన్ని.

కన్నయ్యకైనా యేమంత పెద్దవయస్సని? అయినా తనకి ఆతనికి మధ్యనుండే వయోభేదాన్ని కప్పిపుచ్చటం తనవల్ల కానేరదనుకుంది రామి. సంవత్సరం నుంచి యీ నిర్జనప్రదేశంలో ఒంటరిగా యెల్లా కాలం గడుపుకు వస్తుందో తనకే ఆశ్చర్యమైంది. పగలంతా దొర గ్రామంలోనే ఔషధాలయంలో వుంటాడు. తానుమాత్రం యింటివద్ద ఆవును, తోటను సంరక్షిస్తూ దొరకోసం వేచివుంటూండాలి. తాను దొరను విడిచిపెట్టి వెళ్లలేదు. అతనిలో తన్ను లోబర్చుకొనే అతీతమైన శక్తి యేదోవుంది. లేకపోతే ఆతనిమీద యిష్టం లేకపోయినప్పుడు యింకా తా నాచోటనే యెందుకు కట్టుబడివుండాలి? గ్రామంలో కన్నయ్యకున్నంతపలుబడి యింకెవ్వరికీ లేదు. అందరూ అతన్ని అపరధన్వంతరిగా భావిస్తూ నోరార "దొరా" అని గౌరవిస్తారు. తనకూ ఆయనయందు గౌరవం వుంది. తానూ అతన్ని "దొరా" అనే సంబోధిస్తుంది. అంతే. మనస్సులో ఆయనయందు భర్తృభావం వుందో లేదో తనకే సందేహం.

భారంతో నిట్టూర్చింది రామి. అదే వీరయ్యనైతే తానలా పిల్చేదీ! ఎంతో యింపుగా ముద్దులుమూటగట్టేట్టు "మామా" అని పిల్చుకోదూ? ఏమో, యింతకూ వీరయ్య ఎటువంటివాడో? అతడ్నిగురించి

తన కేమి తెలుసునని? అతడు కన్నయ్యదొర స్నేహితుడు కోటయ్య కొడుకనీ, యేదో మందు తీసుకుపోవడానికని కన్నయ్య దొరవద్ద కొచ్చాడనీ, ఆవాళటికి ఇంట్లో భోంచేసి వెళ్ళిపోయాడని మాత్రమే తనకు తెలుసును. అప్ప టప్పట వచ్చిపోయే చుట్టాల్లో యితడెప్పుడూ రాలేదు కూడాను. ఇతణ్ణి గురించి కన్నయ్యదొరైనా యెప్పుడూ తనతో ప్రస్తావించలేదు. ఏమైనా, యింతవరకూ భర్తవద్దకు వచ్చిన రోగుల్లో యింతమంచి రోగిని రామి చూడ్డం తటస్థపడలేదు. వయసుకాడు, తీర్చి దిద్దిన చందనపుబొమ్మలా గుంటాడు ఓరచూపులతో మనిషి. అతిచురుకుగాను నిలువెల్ల వుత్సాహంతోను కనిపిస్తాడు. ఇంక తన్ను తన వైపుకి లాక్కున్నా డనడంలో వింతయేముంది?అతణ్ణి చూసింది మొదలు—యింతవరకు యెండి బీటలు వారిన తన హృదయసీమలో కుంభవృష్టి కురిసినట్లైంది రామికి.

ఈ భావాల్తో రామిహృదయం రేగిపోయింది. అప్పటికే చాలావేళ అయింది. యింటిపనులు చక్కపెట్టుకోవాలని ఇంట్లోకి వెళ్ళిపోయింది రామి. అప్పుడే కన్నయ్య వీరయ్య భుజించిన యెంగిలి కంచాలు యెత్తబోయింది. ఎంత ప్రయత్నించినా వీరయ్య నామరూపాల్ని మనస్సునుండి కదిలించ లేకపోయింది రామి. వీరయ్య అక్కడే ఒక్కక్షణం క్రితమే ఆ కంచంముందే కూర్చొని భుజించాడు. భుజిస్తూండినంతసేపూ అతడు తనతో మాట్లాడకపోయినా చూపులతోనే తన్నెన్నో విధాల పల్కరించాడు. ఒక్కసారి నంజుకు వడ్డిస్తుండగా ప్రమాదవశాన్ని తనచెయ్యి వీరయ్యచేయీ రాపాడ్డంకూడా జ్ఞాపకం తెచ్చుకుంది రామి. ఆ భావం రాగానే నరాలన్నీ జువ్వుమన్నాయి. రక్తం అంతా వుడుకెత్తి ప్రవహించినట్లైంది. శరీర మంతా గగుర్పొడిచింది. తిరిగీ ఒక్కసారిగ అతణ్ణి మరచిపోదామని ప్రయత్నించింది రామి. ఇప్పుడేమైతే మాత్రం ఏంలాభం? అత నెలాగూ వెళ్ళనే వెళ్ళాడు. తిరిగీ ఎప్పుడైనా యికమీదట వస్తాడో రాడో? వెళ్ళేటప్పుడైనా తనకేదీ సూచింపనైనా లేదు. ఇంతకూ తానాతణ్ణి గూర్చి అనుకుంటున్నట్టు అతడు తనగురించి భావిస్తున్నాడో లేదో? తా నిప్పుడేమనుకున్నా లాభంలేదనీ, వెళ్ళిపోయినవా డింక తిరిగి రాడనీ,యింక అతన్ని మరచిపోవడమే వుత్తమ మనీ గట్టిగా నిశ్చయించుకొని, భావావేశంలోనుండి ఒక్కసారిగా తెప్పిరిల్లి నడుం బిగించి యింటిపనులు చూడుకో తలపడింది రామి.

ఎంగి ళ్ళెత్తిపెట్టి కన్నయ్య దొర గది వూడ్చింది. అతనిబట్ట లవీ సర్ది మడిచిపెట్టి నులకమంచంమీది చాప దులపబోయింది. క్రిందటి రాత్రి కన్నయ్య దొర మొలనుండి వూడిపడిన తాళంచెవి కాబోలు చాపనుండి క్రిందికి పడి చప్పుడైంది. రామి దాని నందుకొని అది దేనిదై వుంటుందా అని ఆలోచించింది. బహుశా అది కన్నయ్యదొర పెట్టెదై యుంటుంది. ఆ పెట్టె కన్నయ్యకు ప్రాణం. ఎవ్వరినీ దానిదగ్గరకు పోనీయడు. దాన్ని చూచేందుకైనా ఒప్పుకోడు. మూడుపూటలూ గ్రామానికి వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ తనతోనే, చేతులారా తీసుకెళ్ళి తెస్తూంటాడు. ఆఖరుకి తన్నైనా దాన్ని ముట్టనీయడు. ఎంతైనా చేసుకున్న పెళ్ళానికి చెప్పరాని రహస్య మందులో ఏముంటుందో? ఆవాళ వుదయమే గ్రామానికి పోయేటప్పుడు వీరయ్య అడిగాడు కూడాను—

"ఏం కన్నయ్యబాబూ! నీ కెందుకేటి బరువు. నీయెనకాల, ఆపెట్టిని నానే మోసుకొత్తాన్లే" అని, అయినా కన్నయ్యదొర అందు కొప్పుకోనేలేదు. చివరికి "పోన్లేరా యీరయ్యా! యియ్యాల దానిపని నాకట్టే నేదునేరా యింటికాడే ఒగ్గేస్తాను" అన్నాడు కన్నయ్య.

"ఏటిబాబూ అందులోని యిచ్చింతరం? నన్ను కూడా నమ్మకపోడానికందులో నేటిగనకం వుందేటి?" అని అడిగాడు వీరయ్య అనుమానం తట్టి. "ఏటుంటా దీరయ్యా? ఏటుంటా దనుకుంటావు? మా వుంటే నా పాతికేల్ల ఆదాయం వుండితీరా లనుకుంటావు. అంతేనా యింకేటుందా" అంటూ వీపుతట్టి వీరయ్యను తీసుకుపోయాడు కన్నయ్యదొర.

తాళంచెవి దొరకగానే యీసంభాషణంతా తలపు కొచ్చింది రామికి. కన్నయ్య చెప్పిన చివరి

వాక్యం రామి చెవుల్లో గింగురు మందప్పుడు. "ఔను ఆ పెట్లో యిన్నాల్లా కూడేసిన దనమంతా కన్నయ్య దొర దాచుకో నుండాల. నేకపోతే ఆరూ యీరూ మందుకనీ మాకుకనీ యిచ్చిన డబ్బంతా యా టవుతాది? అందుకే కాబోల యిన్నాల్నించీ నన్ను దానికేసి తేరి సూడనీనేదు దొర" అని అనుకుంది రామి. ఆ పెట్టె తనని బాగా ఆకర్షించింది. పెట్టె తీస్తే దొర యేంచేస్తాడోనని భయంవేసింది. తా నెన్నోసార్లు కన్నయ్యను కాళ్లా వేళ్లా పడి, పెట్టెలో నే ముందో చెప్పమని ప్రాథేయపడినా, దొర మాత్రం కళ్లు రుముతూ "ఏటుంటే నీ కేఁమి నే! నోరుమూసుకో. అదంతా నారయిస్యం. నువ్వెంత నా దానివైనా, నీతో సెప్పకూడ్దు దాన్నిగూరిసి. సెప్తే నాకు నష్టమొద్ది" అని గదిమేవాడు. ఇప్పుడు సమయం చిక్కింది రామికి. పెట్టె యింట్లోనే వుందీ వేళ అదృష్టవశాత్తూను. తాళంకూడా చేజిక్కింది. ఇంక పెట్టె తెరవకుండా యెలా వుండగలదు? కన్నయ్యదొర అప్పుడే బైటికి వెళ్లాడుకూడాను. ఇక మధ్యాహ్నంవరకూ యింటికి రాడు. ఈలోగా తాను పెట్టె తెరచి చూసినా దొరకు తెలియబోదు. ఈ సమయం వృథాపోనీయకూడ దని, ఏమైతే కానీ, పెట్టె తెరచి చూచింతర్వాతనే తాళంచెవి దొరకు యీయవలె నని నిశ్చయించింది రామి. నడుం బిగించి తన పనికి పూనుకుంది.

*　　*　　*　　*

వాకిట్లో చప్పుడైంది. వెంటనే రామి చీర మడతలో తాళం దాచేసి తృళ్లిపడి లేచింది. గుమ్మంలో వీరయ్య నిలుచున్నాడు.

"అమ్మయ్యా!" అనుకుంటూ వేగిరపాటుతో "ఓస్—నువ్వా?...మళ్లీ యి...లాగ..." అని అనబోయింది రామి నేలకు చూస్తూ.

"వస్తా ననుకోనేదు కాబోల?" అని చిరునవ్వు నవ్వుతూ, "అయితే, రామి నాసిలుకువోనీ వుంచీసుకోవా లనుకుండేటి?" అని కళ్లెగరవేస్తూ అడిగాడు వీరయ్య.

"సిలుక్కువోనే?"

"ఆఁ! అదే! యిక్కడే దా న్నొదిలీసినట్టు గాపకం. పల్లె కెల్లిపోయాక తలుపుకొచ్చిం దా యిసయం. మా వూ రెలిపోతా నని, కన్నయ్యబాబుకి దండాలెట్టి సెప్పి, ఆ వూపున యెకాయెకీ, వోనీ తీసుక్కుపోదామనీ పరుగులె ట్టొచ్చీసాను"

"అయితే యీడ కొస్తున్నట్టుగ..."

"సెప్పనేదు. కన్నయ్యదొరతో సెప్పనేదు. ఎందు కేటి సెప్పడం యీపాటి సిన్న యిసయానికి?"

రామి నవ్వుకుంది. "అయితే యీరయ్యా! నీ సొక్కాలో దాక్కోనున్న వోనీ యాడనుం చొచ్చింది?" అంది వొయ్యారంగాను.

"గెయించినా! సంగతంతా సొష్టంగా గెయించినా! అద్దిగదా ఆలాగుండాల తెలివంటే"

"సరేలే యిక నెల్లు వోనీ దొరికిందిగందా?" అంది రామి పైకి. మనస్సులోమాత్రం అత డింకా కాస్సేపు వుండాలనే కోరుకుంది.

"ఆఁ! యెల్డానికే వొచ్చాన్లే. నిబద్దిగ సెప్తాండాను – రాఁమీ నీకు సెప్పి మరీ పోదాఁవనే వొచ్చాను" అన్నాడు వీరయ్య.

"వోస్సి! అదా – మాదొర సెలవిస్తే మరి నాసెందుకునే. యెల్లు" అంది బాధగాను రామి.

"ఏటే? దొరా? అవున్నే. నీపాపం. ఆడు సెప్పినట్టు తిరక్కపోతే నీగ్గతెలాగనే? ఎద్దు మొద్దుగా నడిస్తే పాలికాపోడు కొట్ట కూరుకుంటాడేటి?" అన్నాడు వీరయ్య చమత్కారంగా.

"శివశివా! నేదు యీరయ్యా! నాదొర నన్నెప్పుడూ కొట్టెరగడు. ఏమన్యాయం పున్యాయం ఐనా నాదేనే—నీ కెందు కేటి పో." అంది కోపంతో రామి. ఇంతవరకూ వీరయ్య తప్ప యెవ్వరూ తన దొరని "ఆడు" అని పలికెరగరు.

"వొవ్వో! — పలికేవు నె ద్దమ్మో పలుకు! — ఆడికి నీమీ దంతమను సుండబట్టే కాబోలు ఆచందుగు

పెట్టినన్నా ముట్టనీడు నిన్ను." వీరయ్య కొంచెం చనువుతీసుకొని రెండడుగులు ముందుకేశాడు. "రామీ! నిజెం సెప్పాలిసొస్తే ఆడు-మనిసా? - రాచ్చసుడు. సక్కని సుక్కలాంటిదానివి నిన్నుసూసి ఆడ్నిసూత్తే కాకిముక్కుకి దొండపం డెట్టినట్టుగుంది. నువ్వెంత సక్కంగుంటావని ఆ డెప్పుడైనా యెరుగునూ? నీకళ్లూ సూరీయసంద్రుల్లాగ, నీలాలనాగ యింత జిగేలుగుంటా యని ఆ డెప్పుడైనా నీతో సెప్పేరుగునూ? నీబారడు జుట్టూ సక్కంగా నెఁమిలిపించంనాగుంటా దని ఆడికి తెల్సా? అయన్నీ నాకు తెల్సు. ఆటిమజా నానే సూడాల" అంటూ చటుక్కున రామిచెయ్యి పట్టుకున్నాడు వీరయ్య. అతనిగొంతుకు సన్నగిల్లింది. వుద్రేకంతో "ఆడు నిన్ను ప్యేఁమించనేడు పిల్లా. అదంతా నాను సెయ్యాల. రాఁమీ! నువ్వు నాదానివి కావాల. ఆడు నిన్నేలుకోనేడు. జోడుగుర్రాలమీద దెక్కించి నిన్నూరేగిస్తాను. నిన్ను నాదానిని సేసుకుంటాను. రామీ! నన్నేలుకోవూ" అంటూ ఒళ్లోకి లాక్కోబోయాడు వీరయ్య.

రామి పెనగులాడుతూ "ఛీ వూరుకో! తిన్నింటికి వాసాలు నెక్క పెట్టెడ మిదేగంద?—ఛా! ఏంబుద్ధులియ్యి యీరయ్యా? పో అవతలకి నా దొరొస్తే ఢొక్క సీల్చేస్తాడు" అంది తెచ్చుకొన్న కోపంతో రామి.

వీరయ్య పకపక నవ్వాడు.

"ఎందుకమ్మో అంత కోపమూ? ఆడిసొమ్మేదైనా దొంగలాడేను గనకనా? నువ్వాడి సొమ్మయితే గదా ఆడికోపం? ఆడివొస్తువు కానిదాన్ని తీసుకుంటే దొంగన నేమొగో డంటాడో రమ్మను" అన్నాడు వెటకారంగా వీరయ్య.

"కాద నేరు సెప్పగల్రు యీరయ్యా! సుమాటికీ నేను క-న్న-య్య దొరకి పెల్లా......న్నే" అన్నది రామి తలవంచికొని. అయినా హృదయంలో నుండి రాలే దామాట.

"కడంటా సాంతంగా యినుఁ రాఁమీ"...అంటూ రామిచేతుల్ని గుండెల కత్తుకుంటూ, "నామనసులోని మాట పైకి కక్కేసాను పిల్లా! నిన్ను యీడదేరూ లేనిసోట యీ పాకలో సూత్తుంటే ఆ పంజరంనోనిసిలక వూసలకి రెక్కలు కొట్టుకుంటున్నట్టనిపిస్తాది. నీవొయిసా, సాలా సిన్నది. ఆ ముసిలోడితోటి నువ్వేటి మనువుతావు నే? సూడు నేను నిన్నెంచక్కా యేలుకుంటాను. వొయిసుసిన్నెలన్నీ నవ్వానుబవిద్దువుగాని. యే టిక్కడీ సచ్చినోడితోటి కాపరం? రా. నాతో నేచి రా. మరత్తే ఆల్చెంచెయ్యక. నాకు తెల్సు నీకూ యిట్టమే నని. బేగి సెప్పేదో—అన్నీ యియ్యాలే రైటు కావాల" అన్నాడు రామి గడ్డం నిమురుతూ వీరయ్య.

"నేచిరాలేను యీరయ్యా" అంది రామి సందేహిస్తూ.

"ఆఁ! ఎందుకు రానేవు? వొస్తావు. రాగలవు వొచ్చితీరుతావు. నేకపోతే కలకాలం యీ సోట యీ అడివిలో బతుకుగల్దువా పెపంచం అంతట్నీ సూడకుండాను. పెపంచకానికి నువ్వు కావాల నీసక్కదనం కావాల. నీసక్కదనం యీసోట కుళ్లిపోకూడ్దు. ఎవలైనా అనుబవించాల. దానికి నాను తయారీ. మరత్తే సూడకు బేగినీ సెప్పు. మల్లీ ఆ డొస్తాడు.

కన్నయ్యదొరను తలచుకోగానే రామికి నవనాడులూ లాగేశాయి. భయంతో "వొద్దీరయ్యా! నన్నొదిలీ సెల్లు నేను రానేను. దొరకాడే వుండిపోతాను" అని రెండుచేతులతో కళ్లుమూసికొని యేడ్చింది రామి. వీరయ్య రామిని అమాంతంగా చేతుల్లోకి తీసుకొని, తల నిమురుతూ గాఢంగా ముద్దెట్టుకున్నాడు. రామి మెత్తబడి అతడి గుండెలమీద కొరిగింది.

"రాఁమీ, రాఁమీ, నారాఁమీ నువ్వునా రానివే" అని గుండెల కత్తుకున్నాడు వీరయ్య. రామికి శ్రవణానందమైంది. ఆ క్షణంలో సెలయేటి నిస్వనాన్ని, కోకిల కలకూజితస్వరాన్ని మించి వినిపించింది వీరయ్యగొంతుకామెకు.

"మాఁవా! నామనసూ నీమీనే. నాపానాలన్నీ నియ్యే "అని తల వాల్చింది రామి. ఒక్క క్షణంవరకు ఆనందస్వప్నంలో వుండిపోయింది రామి.

"అయితే యియ్యాలే మనిద్దరం వుడాయించీయాల? యియ్యాల్నుండి మనం సత్తెప్పెమానంగా ఒకల్లొకలిడిసిపెట్టి ఉండకూడ్దు" అన్నాడు వీరయ్య.

"నా మొగుడ్నెలా గిడిసిపెట్తాను మాఁవా?" అంది రామి

"నన్నా? ఆడ్నా? అవూ సెత్తకునే. నీ యిట్టం యేదో కానిచ్చి. ఆడిపని ఆడే సుసుక్కుంటాడునే. బాదపడకు."

"నేదు మాఁవా! కన్నయ్యదొర సంరచ్చనకో ఆసదుండాల మాఁవా" అంది గద్గదికతో రామి.

"ఓలబ్బ! ఆడేఁ పెరగడేటి? ఇప్పటికే నీతోటిద్దరయ్యారుగందా? ఇక మూడోదాన్ని మూడేట్టుకుంటాల్లే నీకేటి. ఆడికేకాదు నాకూ కావాల్నా ఆడది. నాకు నువ్వే కావాల" అన్నాడు వీరయ్య.

రామి నిట్టూర్చింది. ప్రేమపురస్సరంగా వీరయ్యకు పెదవు లందిచ్చింది.

"ఇదుగో నాగ్యేపకానికీ సిల్కువోనీ తీసుకో. రాతిరేల నువ్వొచ్చిసీటప్పుడేదైనా మాటకట్టుకోడానికి పనికొస్తది. నే నిప్పు డెల్లిపోతాను. ఆడొచ్చియాలయింది. అద్దరేతిరికాడ అల్లదిగ్గో ఆ పెద్దమర్రి సెట్టు కాడి కొచ్చి నీకోసం కాసుకూక్కుసుంటాను. ఆడునిద్దరోతుంటే సడిసేయకుండా సల్లంగా జారొచ్చి. కొంచెం పిసరా పిప్పి యాదైనా వుంటే తెచ్చినే. కొన్నాల్దాకా కాసొస్తాది. తరవాత నా నున్నాన్నే. నీకే యిబ్బందీ రాదునే ... మరి నే నెల్తున్నాను. నే సెప్పినవన్నీ మరిసిపోక" అంటూ మారుమాటాడకుండా రామిని ఒదిలి ఒక్కపరుగున వెనక్కి తిరిగిచూస్తూ పారిపోయాడు వీరయ్య.

రామి కేమీ పాలుపోలేదు. వీరయ్య పొలాల గట్లు దాటి పోతూంటే రిచ్చవడి చూస్తూ వుండిపోయింది. ఇంతవరకు వచ్చాక వీరయ్య తిరిగి వస్తాడో రాడో అన్న సందేహం లేకపోలేదు రామికి. అప్పటికే అతన్ని తిరిగీ పిల్చి తాను దొరను విడిచి రాలేనని చెప్పా లనుకుంది. అప్పటికే మనస్సు మార్చుకుంది. అయినా వీరయ్యను తన మనస్సార, నిలువునా, యెంత ప్రేమించినా కన్నయ్యదొరను మోసగించి వెళ్ళిపోవడం తన కెంతైనా దుస్సాధ్య మనుకుంది. ఒకప్రక్క యిష్టం లేకపోయినా బలవంతంమీద అతి సన్ననిగొంతుతో వీరయ్యదిక్కుకు చేయి జాపి మెల్లగా "యీరయ్యా! మాఁవా! నేను... నేను దొరను యిడిసి రాలే..." అని చతికిలబడింది రామి. వీరయ్యకామాట లేవీ వినపడలేదు. వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ నా మాట మీరకుమీ అని చేత్తో సూచిస్తూ ఆ తోటల్లో పడి మాయమైపోయాడు వీరయ్య.

* * * *

కన్నయ్యదొర ప్రొద్దు పోయాక వచ్చాడు యింటికి. రాగానే తాను వుదయం విడిచివెళ్ళిన సందుగుపెట్టె యథాస్థానంలో నున్నందుకు సంతోషించి, రామితో "అమ్మీ! నా నేటి కెల్లి నీలోఁకొ నొస్తానే. యింతలోనే యాదేనా కూటిలో కఁవిర్సి పెట్టు" అని చెప్పి స్నానానికి పోయాడు కన్నయ్య.

ఇంతవరకు వీరయ్య ప్రేమసముద్రంలో మునిగిపోయి రామి పెట్టెసంగతే మరచిపోయింది. యిప్పుడైనా యేమంత మించిపోయింది? దొర యెలాగూ స్నానానికెళ్ళాడు; యింతలో పెట్టె తీసి చూడవచ్చునని, కన్నయ్య ఆవలి గడపలో కాలిడిందే తడవుగ, రామి తాళంచెవి పైకి తీసి పెట్టె తీయ పూనుకుంది. సరి. తాళం తీసి పెట్టెమూత యెత్తబోతూండేసరికి యెక్కడినుండో కన్నయ్య వూడిపడి ఘర్జిస్తూ పెట్టెమూత తీస్తూన్న రామిచేతి నొక్కపెట్టున కాలితో తన్ని "ఓసి ముండా! యెంతకైనా తగుదువే నువ్వు! తుడుసుకోడాని కేదేనా గుడ్డెత్తుకు రావాలాని, సఁవెయాని కొచ్చాను గావెట్టి సరిపోయింది నేకుంటే యీపాటి కేఁమైపానో. నీ కెక్కడి తెగు లొచ్చిందే సావ్వే ముండా. దానియేపు సూడకే సూడకే అని అన్నాల్నుండి సతపోరు గడ్తున్నా యినిపించుకోకండా, నాను లేని సఁవెయం సూసి అందులో నేటుందని దొంగలాడదాఁ వనుకున్నావే నంజా!" అంటూ కళ్ళ

రుదుసుతూ ఒక్క పెట్టున పెడబొబ్బ పెట్టాడు కన్నయ్యదొర.

దొర తాపుకు రామి ఒకమూల బోరగిలాబడి వెక్కి వెక్కి యేడ్చింది. వణుకుతూ ఆమూలనే నక్కి కూర్చొని "నేదు దొరా! నాకేఁమీ దొంగలాడాలని నేదు. ఇందా కిల్లాడుస్తుంటే యీ తాలం సెవి దొరికితే అది యీ చందుగు పెట్టెదో కాదో సూసి అయితే నీకిచ్చీయాల్నసకుంటన్నానుదొరా! ఇంకేమీ దురుబుద్ది నాకు నేదు దొరా" అంటూయేడ్చింది రామి.

కన్నయ్యదొరకు కడుపు కరిగింది. రామి సెప్పేకూ తానం తేనీమాట లనలేదు. పైగా ఆమె ప్రేమ సంపాదించడంకోసం ఎన్నో విధాల ఆమెను లాలించేవాడు. ఈ వాళకూడా నిజానికి రామిగురించే తానింత కాఠిన్యం వహించవలసి వచ్చింది. మళ్లీ యిలాగన్నాడు కన్నయ్యదొర — "రాఁమీ! పోన్నే అయిం దేదో అయింది, యాడవబోక. మరి నీ కెన్నిచాల్లు సెప్పినా సివరికి పెట్టె తీడానికే తలిసావు. అందుకే నాకు కోపం వుండబట్టక యాదో మాటన్నాను నొచ్చుకోక. యెల్లి బేగి నీవొంట సెయ్యి. తానం సేసి కూస్సేపట్లో వొస్తాను. తే; తాళం తే—" అని తాళం పుచ్చుకొని తిరుగ పెట్టెకు తాళంవేసి తాళంచెవిమొలకు కట్టుకొని యేటికి స్నానానికి పోయాడు కన్నయ్యదొర.

ఆవేళ దొర త న్నంతేసి మాట్లాడు తుంటే రామి కాతనిపై మనసు విరిగింది. అసలే వీరయ్య కొంత మతి విరిచాడు; దాని కీ యుదంతం దోహద మయింది. దొర యెన్నిసార్లు లాలించినా ఆ లాలనలో రామి కా సమయంలో ఆలోచిస్తే అసహ్యభావం కలిగింది. ఆ ముసలిని మాయంచేసి తప్పించుకోవాలనే దృఢనిశ్చయం చేసుకుంది. గీరుకుపోయిన చేతిని చూసుకుంటూ వంట చేయబోయింది. వండుతూండినంతసేపూ తనకు వీరయ్యపైనే మనస్సు. ఇంతవరకూ తన మనస్సులో దొరకు అన్యాయం చేస్తున్నానేమో యనే ధర్మసందేహం కొట్లాడుతుండేది. ఈ దెబ్బతో అది పటాపంచ లయింది. దొర తనయందు క్రూరంగా జంతువువలె వర్తించాడు. తాను నిజానికి దొంగతనం చేయ తలపెట్టకపోయినా తనమీద నిందారోపణ చేశాడు. ఇదివరకటి దొరమీది తనకృతజ్ఞత అంతా యీ పెట్టున అసహ్యంగాను పగగాను మారిపోయింది రామికి.

"ఏం పిల్లా చెయ్యి గీరుకుపోయిం దేటి? పాపం! నూన రాసి మంతరిస్తానునే బయం నేదు" అన్నాడు కూడాను కన్నయ్య రాత్రి భోంచేస్తూ.

"అక్కర్నేదునే దొరా మాదొడ్డోడిపి" అని విసురుగా పలికింది రామి. పాపం! కన్నయ్యదొర మనస్సులో యెంతగా విచారించాడో.

ఆవేళ రాత్రి రెండు ఝాము లైంది. అలసిసొలసి కన్నయ్యదొర నిద్రపోతున్నాడు గురకపెడ్తూను. రామి సడిచేయకుండా లేచి చేతిదెబ్బకు కట్టు కట్టుకుంది. ఆ బాధలో ఆమె దొరను ఎన్నైనా తిట్టిపోసింది. ఆ సమయంలో ఆతని కెంత ద్రోహమైనా చేయతలపెట్టింది. ఈ యింట్లో యీ ముసలోడికి కట్టుబడి తానేమీ సుఖ మనుభవించలేనని తలపోసింది రామి. ఇంకొక్క క్షణంలో తనవీరయ్యతో యెనలేని సౌఖ్యం చూరగొంటానుకదా అని వుర్విళ్లూరింది.

వెంటనే లేచి సవ్వడి కాకుండా వీథివాకిలి తెరచి, వుత్తచేతులతో పైకి పోయింది రామి. ఆఖరు సమయంలోనైనా, దొరచే తాను దొంగనని నిష్ఠూర్యం పడడం రామికిష్టంలేకపోయింది. అందుకే ఆ యింట్లో నుండి ఒక చిల్లిగవ్వైనా తనవెంట తీసుకోపోలేదు. ఇంటినుండి బయటబడి, చివరిసారి — ఒక్కసారిగా యింటివైపు మనస్సార చూచి, తాను చేతులార పెంచిన గోమాతకు అక్కడినుండే నమస్కరించి, వెనుదిరిగి, గ్రుడ్డివెన్నెలలో భయంతో మెల్లగా అడుగు లిడుతూ నిర్ణీతస్థలం చేరుకుంది రామి.

ఆ మర్రిచెట్టువద్ద వీరయ్యజాడ లేవీ అగుపడ లేదు రామికి. ఏమో తాను ముందు వచ్చిందేమో. ఇంతకూ వీరయ్య కాలనిర్ణయం చేయనేలేదు. ఎప్పటికైనా వీరయ్య రాకపోతాడా, తానూ వీరయ్య కలిసి చిలకా గోరింకల్లా అడవుల్లోనుంచి ఎగిరి పోకపోతామా అన్నధైర్యంతో రామి ఆ చెట్టుమొదల్నే కూర్చొని వీరయ్యకోసం నిరీక్షింప దలచుకుంది. కొంతసే పయాక ఆ గ్రుడ్డివెల్తురులో తన కేదీ కన్పించక

పోయినా ఏదో మనుష్యులు నడిచిన చప్పుడుమాత్రం అయింది

"మాఁవా! మాఁవా! ఇక్కడ-నే నిక్కడే వున్నాను" అని మెల్లగా పిల్చిందకూడాను రామి. అయినా జవాబు రాలేదు. రామి ధైర్యం విడువలేదు. ఆ రాత్రంతా మెలకువతో వీరయ్యకోసం వేచివుండా లనుకుంది. కాని ఆ వేళటి మనస్సు రాపిడిచేత రామి అట్టేసేపు తెలివిమీద వుండలేకపోయింది. కాస్సే పటిలోనే, ఆ చెట్టుమొదలుకే తలచేర్చి, ఆ శీతరాత్రిలో అక్కడే నిద్రపోయింది.

* * *

తిరిగీ మరుఝామునసే మంచుకు బిగిసి తెలివొచ్చి లేవగల్గింది రామి. తా నెంతసేపు నిద్రపోయిందో తనకే తెలియదు. అయితే వీరయ్య రాలేనట్టే; మరి రాడని ధ్రువపర్చుకొంది. అతని యిన్ని ప్రేమాలాపాలూ వట్టిపొల్లులేనా? అతనిచేష్టలన్నీ పరాచికాలేనా? అతని సూచనలన్నీ కట్టుకథలేనా? "ఏం మొగోడు?" అనుకుంది రామి. ఇంతా అతన్ని నమ్మి మోసపోయినందుకు తగినశాస్తి అయిం దని తన్ను తాను నిందించికొంది. అప్రయత్నంగా యేడుపు కమ్ముకు వచ్చింది రామికి. ప్రపంచమంతా తన్నింక వేలెత్తి హేళన చేస్తుందని భావించుకొంది. తన జీవితంలో తీరనిమచ్చ తెచ్చిపెట్టికొన్నందు కెంతో దుఃఖించింది. ఇక లోకంలో తలెత్తి తిరగడమెట్లో అని భయపడింది. ఒక్కసారిగ తన తప్పిదమంతా కళ్ల ముందు తాండవించింది. ఇంత కృతఘ్నురాలనే నాకింక పుట్టగతు ల్లేవని వలవల యేడ్చింది రామి.

ఇప్పుడు తా నేంచేస్తుంది. తనకు తెలియకుండా కన్నయ్యదొర తన్ను వెంబడించి సంగ తంతా యీపాటికే గ్రహించివుంటాడు. ఏమో అతడు వెంబడించలేదేమో! తనగు ట్టింకా బయటపడ లేదేమో! ఇంటికి పోతేనే మంచిదేమో! అతనికి తెలిస్తేమాత్ర మేమి, పాదాలమీద పడి తనతప్పు మన్నించమని ప్రార్థేయపడితే ఆ మాత్రం క్షమించకపోడు మహానుభావుడు కన్నయ్యదొర. పోనీ క్షమించక చావమోదినా ఫరవాలేదు తనతప్పుకు తగినశాస్తి అవుతుంది. ఇక్కడ వుండి నల్గురినోళ్లలోనూ పడేకంటే మొగుడిచేతుల్లో చస్తే పుణ్యమైనా వస్తుందని అనేకవిధాల ఆలోచించి రామి చివరకు యింటికే పో నిశ్చయించింది

లేచి అడుగుల్లో అడుగులు వేసికొంటూ రామి మెల్లగ యింటిదారి పట్టింది పొలాల గట్లమీదినుండి. రామిమనసు మనసులో లేదు. తనుచేసిన ఘోరానికి, గాలికి కదలిన చెట్లకొమ్మలుకూడ తనవిషయమే వూసులాడుకుంటునట్టు తోచింది. కప్పలు బెకబెకలాడుతూ తనవర్తనను చూసి పకపక నవ్వుకుంటునట్టు తోచింది. చివరికి అస్తమించు చంద్రబింబంకూడా తన నడవడిని శంకించి వెలవెలబోయిం దనుకుంది రామి. దూరాన్నుండే తనయింటిని- తిరిగి యెప్పటికి కలలోనైనా చూస్తా ననుకోనియింటిని తిరిగీ రామి చూచింది. గుండెలు దడదడా కొట్టుకున్నా యామెకు. ఇల్లుమాత్రం యెప్పటిలాగునే ప్రశాంతంగా వుంది. రామి యింటిచేరువగా నడిచింది. అన్నీ - పరిసరా లన్నీ సలక్షణంగానే వున్నాయి కాని యింటితలుపుమాత్రం బారలా తీసి వుంది. తాను వెళ్లినప్పుడు తలుపు దగ్గరగా వేసి పోవడం తనకు బాగా జ్ఞాపక ముంది. అయితే యిప్పు డెందుకు తెరిచివుండాలి? దూరాన్నుండే తలుపుసవ్వడి యిప్పుడే తాను వినదికూడాను. ఏదో ముప్పును శంకించింది రామి. బహుశా దొరయే తన్ను వెతకడానికని బయటికి వెళ్లేడేమో. ఒకవేళ మరిచిపోయి తానే తలుపుతీసివుంచిందేమో? అలాగయితే భయమే లేదు. తాను చప్పుడు లేకుండా యెప్పటియట్లే యింట్లోకి పోయి యేమీ జరుగనట్టే వుండవచ్చు. ఈ ఆలోచనల్లో రామి త్వరగా యింటిగడప ఎక్కింది. లోపలనుండి వుచ్ఛ్వాసనిశ్వాసాల్ని చెవుల్నిక్కపొడిచి "విని అమ్మయ్య బతికాను రా దేఁవుడా!" అని దేవుడి కనేకధన్యవాదా లర్పించి, యింక తనగుట్టు వెల్లడికానందుకు, దొర యింకా లేవనందుకు ఎంతో సంతోషించింది. అయినా సందేహం మాత్రం వొదల్లేదు రామిని. ఆశ్వాస సాధారణమైంది లా వినబడలేదు. కొంచెం బరువుగాను, కోరివుండి పట్టి పట్టిపీల్చుతున్నట్టూ వినబడింది. రామిగుండెల్లో రాయి పడింది. ఏమో కన్నయ్యదొర తన్ను పరీక్షించడానికి కలతనిద్ర అభినయిస్తున్నాడేమో. ఏమైతే కానిమ్మని

తెగించి లోనికి పోయింది రామి. గదంతా చీకటిగా వుంది. గదిగుమ్మంవద్దనే యేదో కాళ్లకు తగిలి పడి పోయింది రామి. మోకాళ్లమీద లేచి తడిమిచూసి ఆదో కమనిషి శరీర మని పోల్చికొంది రామి. వెంటనే భయంతో ముచ్చెమటలు పోశాయి. కెవ్వనకేకవేసి కళ్లుమూసుకోబోగా చేతికి అంటిన జిగటరక్తం తడి తడిగా తగిలింది రామికి. తిరిగీ తడిమి చూచి దెబ్బ తిని పడివున్నది కన్నయ్యదొరే అని తెలుసుకుంది రామి. ఇల్లంతా తడివి వెదికి దీపం వెలిగించింది.

కన్నయ్యదొర శవంచుట్టవలె ద్వారాని కడ్డంగా పడివున్నాడు. ఇంకా వుచ్ఛ్వాసనిశ్వాసాలు బాగానే వున్నాయికాని, తలమీద బలమైన గాయం తగిలిందని గ్రహించింది రామి. సాయానికైనా చుట్టుపట్ల మైలు దూరంలో యెవ్వరూ లేరు. తానొంటికత్తె అసహాయ యై భయంతో యిల్లంతా కలయజూచింది. వెంటనే సందుగుపెట్టె యథాస్థానంలో లేకపోవడం గ్రహించింది రామి. వెంటనే జరిగిన కలాపమంతా కళ్ల కట్టింది. అందుకే, ఆ పెట్టిలోని, తన కన్నయ్యదొర సర్వ స్వాన్ని, అపహరించడానికే ఆ దొంగముండా వీరి గాడు వలపునెపాన్ని తనమీద మచ్చుమందు చల్లి రాత్రివేళ బయటికి పంపించి, సమయం చూసి కన్న య్యను గాయపరచి తాళం లాక్కొని పెట్టెతో వుడాయించి వుంటాడని గ్రహించింది రామి. వీరయ్య తన కిచ్చిపోయిన సిల్కువోణీ ముక్క ముక్కలుగ చించి నీటిలో తడిపి కన్నయ్యదొర గాయాన్ని కడి గింది రామి. కసితీరా వీరయ్యను శపించింది. తన మాంగల్యమే శుభప్రదం కావాలంటే వీరయ్య — తన్నింత వంచించిన వీరయ్య—తన సంసారాన్నొక్క క్షణంలో సర్వనాశనం చేసిన వీరయ్య నెత్తురు కక్కి చావా లని శపించింది. కోపంతో రోమరోమాలా కంపించిపోయింది రామి.

తన దొర నష్టం ఆలోచించింది. ఇన్నేళ్ల పాటి రెక్కల కష్టమూ ఆ నాటితో వృథాపోవడం తనమూలాన్నే — తన స్వార్థపరత్వాన్నే — తన మాయదారిబుద్ధిమూలాన్నే. తన్ను ముక్కలుగ కోసి నా పాపం లేదు. దొరను చూచేసరికి రామి కేడు పాగలేదు. కన్నయ్యదొర తలను తొడపైకి తీసికొని చీర చెరగుతో విసరుతూ దొరముఖంపైపే నిదానించి చూస్తూ నిరీక్షించింది రామి. ఆ మూతవడిన కన్నుల్లో-- పెదవుల వంపులో—యెంతో ప్రశాంతత కనుపడింది రామికి. ఆవేళ సాయంత్రం తప్పించి యెప్పుడైనా దొర తన్ను కసిరేవాడా? ఎన్నివిధాల తన్ను లాలించి పాలించే వాడు? "రామీ! నామీద నీ కెప్పుడు దయ కలు గుద్దో" అని ఎన్నిసార్లు తన్ను గడ్డంపట్టి ప్రాథేయపడే వాడు? తానెప్పుడైనా తన్ని భర్తవలె గౌరవించిందీ? తా నెంతపాపాత్మురాలు? అటువంటి సద్గుణరాశికి తానుభార్యగా వుండడానికన్ని నోములు నోయాలి? అయినా ఆ సంవత్సరంపాటు దొరని చులకనగా చూసి నందుకు తనకే శిక్ష విధించాలి! అయినా తానుమాత్రం ఆయన్ను వదలివుండగలిగిందా? దానికి కారణ మే మై వుంటుందో తాను కొంచెమైనా ఆలోచించిందీ? తన మలినముఖాన్ని దొర కేవిధంగా చూపుతుంది? దొర విషయమై ఆలోచిస్తూంటేనే రామికి ఆయన మీద అవ్యాజప్రేమ అంకురిస్తూ పెరుగుతూంది. తన పొరపాటుకు లోలో నెంతో కుమిలిపోయింది. మన స్సులో దొరపవిత్రనామాన్ని సహస్రజపం చేసికొంది.

నెమ్మదిగ దొరతలను తనలేతవక్షాని కదుముకొని "దొరా! నాదొరా!" అని యెన్నోమార్లు పలవించింది రామి. హృదయంలో ఆతనిగూర్చి యమయాతన ననుభవించింది. తనభర్తను—తన కన్నయ్యదొరను శీఘ్రంగా ఆరోగ్యవంతుని జేయు మని మనస్సులో వేయిదేవుళ్లకు మొక్కుకుంది. గొంతుకలో గాద్గదిక పుట్టింది రామికి ఆవేశంలో. కళ్ల వెంబడి నీళ్లు జలజలా రాలాయి. వణకుతూన్న పెదవుల్ని కన్నయ్యదొర ముఖాన్ని ఆన్చి వలవలా యేడ్చింది రామి.

దొర కదిలాడు. కళ్లు విప్పి రామి కళ్లల్లోకి చూశాడు.

"ఏం అమ్మీ! అలా నేడుస్తూండావు?" అని హీనస్వరంతో అడిగాడు కన్నయ్యదొర.

"దొరా! యీ పాపాతుమురాల్ని సెమించు. దీనిపాడుబుద్ధి మూలకంగా నీయాస్తి నీయారోగ్గెం పోనాది. యీ బడవముండను నీలముంచినా పాల

మంచినా నీదేభారం" అంటూ దొరచేతులు పట్టి బావురని యేడ్చింది రామి.

కన్నయ్యదొర కొంచెం నవ్వాడు- "ఓస్సి! అదా? ఆ సందుగపెట్టా— అదే—దానిసికతరగా— అదే తెచ్చి పెట్టినా దీవాలక మంతాను. దాన్నిగురించి ముందే నీతో సెప్పేసుండినా బాగుండిపోను. నా మంతరం పోద్దికావాలని జడిసి సెప్పనేదు నీతోటి. పోలేపోనీ యిప్పుడైనా సెప్పితీర్తాను నీతోటి యిను— ఆ పెట్టైనోంది ఆ స్త్రీకామా మన్సూ కాదు. ఒక బయంకరమైన యిససర్పం. దాన్నిసూడెయ్యడం నాకోడికే తెల్సు. యింకేరైనా దాన్నిసూత్తేనేసాలు సత్తారు. అందుకే నిసైనా దాన్నిసూడ్నిచ్చివోణ్ణికాదు. అయితే దానిపనేటంటావు—ఎవలికైనా పాముగట్టా కుట్టిందంటే యీ పాముని తీసుకెల్లి కుట్టినోడికి సూపి మంతరిస్తే ఆడికి తగ్గిపోద్ది. ఈ రయిస్యం ఎవలికైనా తెలిస్తే నా మంతరప్పెభావం పోద్దని నా సెవల్లోని సెప్పనేదు. అందుకేగంద నిన్నటేల నిన్నుకూకలేశాను. నువ్వుకూడ నామీద నలిగేవు. ఆ రాచ్చసిముండావోడు యీరిగాడు పాపం! అందునోయాటో దనరాసులున్నాయని కాబోల నన్ను కొట్టి పెట్టే, తాలామూ పట్టుకుపోయాడిప్పుడే. అనుబవిత్తాడునే ఈపాపానికి" అంటూ అలిసిపోయి చెప్పాడు కన్నయ్యదొర.

దొరప్రభావం అప్పటికి బోధపడింది రామికి. ఇన్నాళ్లూ దొరచర్యలకి కారణ మవగాహనమైంది. దొరపైని ప్రేమ మినుమడించింది.

"దొరా! నాదొరా! నా నిన్నాళ్లూ నీ కెంత సంకటం సేకూర్చినానో—నా తప్పు లన్నీ సెమించవూ?" అని రామి తనముఖాన్ని దొరముఖానికి రాసింది.

కన్నయ్యదొర రామితల నిమురుతూ "రామీ! యింకా నన్నలాగే పిలాలనేటి?" అని తలెత్తి అడిగాడు నవ్వుతూ.

రామి నవ్వుతూ సిగ్గుతో "మామా, నాముద్దుల మామా!" అని దొరగుండెలమీద వాలింది.

అంతలో దూరాన తోటలో పెడబొబ్బలు వినిపించాయి. కేక లంతకంతకు అధికమై ఒక్కసారిగా చల్లారిపోయాయి.

రామి భయంతో దొరను గట్టిగా పట్టుకుని "మామా అదేటిమామా! మనిసికేకల్లా గిని పిస్తన్నాయి" అని అడిగింది.

దొర నవ్వేడు "ఊ. ఏదో తోడేల్ని—కాదు మనిసిరూపాన్నున్న తోడేల్ని పాము కరిసుంటాది. ఆ మెకం సచ్చుంటాది అరుపుమాని. అంతే" అన్నాడు.

రామి గ్రహించింది. కన్నయ్యదొరచేతుల్ని గట్టిగా రొమ్ము కదుముకొని "మావా జలమజలాల్లకీ నువ్వే నాకు మామవి కావాల" అంటూ తృప్తితో కళ్లు మూసింది రామి.

"రామీ! నారామీ! నీ కిన్నాలకి నామీద మనుసుకలిగింది. నా నింక దన్యాతుమ్ముడ్ని. నాకోర్కె లన్నీ యిక పలప్పెదమైనట్టే" అని ఆనందాశ్రువులు కార్చాడు కన్నయ్యదొర.

డి. సి. వాటర్ ఫీల్డు కథఆధారంగా.